# కుక్కచావు

## ముద్దంశెట్టి హనుమంతరావు

హౌరా పోయే మెయిల్, గంభీరంగా కూసుకుంటూ, ఆ స్టేషన్లో ఆగకుండా, పెద్దశబ్దం చేసుకుంటూ, శరవేగంతో సాగిపోయింది. అంతవరకూ ఆకుపచ్చ జెండా చూపుతూ నిల్చున్న చిన్న మేష్టారు తన గదివేపు నడుస్తున్నాడు.

ఆ స్టేషను ప్లాట్‌ఫారమ్ మీదున్న సిమ్మెంటు బెంచీ మీద కూచున్న నారాయణ, సాగిపోయిన రైలుబండి కేసే చూస్తూ వుండిపోయాడు కొద్దిక్షణాలు. రైలు కనుచూపుమేర దాటిపోయింది.

భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు నారాయణ. ఆనాటి సంఘటన తర్వాత పరిణామాలు అతడి కళ్ళముందు సినిమా రీళ్ళలా గిర్రున తిరిగినయ్.

రెండేళ్ళ క్రితం

నారాయణ అదే ప్లాట్‌ఫారం మీద సిగరెట్ కాల్చుకుంటూ హుందాగా తిరుగుతున్నాడు. అతడికి వుద్యోగమంటూ యేవీ లేక పోయినా నిత్య జీవితానికి అతడి సరదాలకి సరిపడే దినసరి ఆదాయం వుండేది. ఆ స్టేషను ప్లాట్ ఫారం మీద తలదాచుకునే అనాథబాలురు, నిరుద్యోగులు, కుంటి, గుడ్డివాళ్ళకు, చిల్లర దొంగతనాలు చేసే వాళ్ళకి, చిరునాయకుడిగా చెలామణి అవుతుండేవాడు. స్టేషను మొత్తం మీద నారాయణంటే అందరికీ భయమే:

నారాయణ మంచి ఒడ్డూ పొడుగూ వుండి మొరటుగా అగుపించినా అధునాతన దుస్తుల్లో అతడికి ఓ విధమైన హుందాతనం వచ్చేది. అతడి తల్లిదండ్రులెవరో అతడికే తెలీదు. బుద్ధి తెలిసిందగ్గర్నించీ ఆ స్టేషను ప్లాట్‌ఫారం మీదే వుంటూ వచ్చాడు. యెవరు వాడి గురించి అనగా విన్లేదు. అయితే, ఓ సారి నారాయణ పెద్దరికానికి అసూయపడ్డ కుంటి వెంకడు, వాడిని అవమానించాలని అన్నాడు

"ఒరేయ్ నారాయణా! నువ్వు మరీ యిరగబడి పోకురా: నీయమ్మ యెలాంటిదో, నిన్నెలా కన్నదో తెలిస్తే నువ్విలా యిరగబడిపోవు. పెద్దలంటే గవురవం నేదు. దేవుడు బలమిచ్చాడు గదా అని, యిన్నూ మిన్నూ గానకుండా మసులుతున్నావు. అది మంచిది కాదురా..." అని

నారాయణ కళ్ళు చింత నిప్పులే అయ్యాయి. మిణుకు మిణుకు మనే లైట్ల కాంతిలో కూడా, వాడి కళ్ళమెరుపు కనిపించిందందరికీ.

"కుంటి యెదవా, యేట్రా అన్నావు! మా అమ్మని అలా గంటావురా? అదీ నాయెదుట్నే! ఎంత ధైర్యంరా యెదవా!" అంటూ వాణ్ణి పచ్చడి చేసి వదిలాడు నారాయణ.

కుంటి వెంకడి గోల వింటూ కూడా అక్కడున్న వాళ్ళెవ్వరూ ముందుకొచ్చి నారాయణని అడ్డలేదు. వాళ్ళకీ తెలుసు నారాయణ యెంత దుర్మార్గుడో. కాస్సేపు తర్వాత చంటి మాత్రం మధ్యకొచ్చాడు.

"ఒరే అన్నా! సాలించరా యింక. ఆడు సచ్చిపోతాడ్రా. సాలించరా. ఆడు సేసిన తప్పుకి తగిన బుద్ధి సెప్పినావుకదా సాల్లేరా" అంటూ బ్రతిమలాడే ధోరణిలోనే వారించాడు.

చంటి అంటే నారాయణకి అభిమానం యెక్కువ. వాళ్ళిద్దరి వయస్సుల్లో వ్యత్యాసం వున్నా సమానవయస్కుల్లానే మసలుతూ వుంటారు. చంటికి పదునైన మెదడుందని నారాయణకి తెలుసు. అందుకనే నారాయణ కుడి భుజంగా వుంటాడు.

ఆ స్టేషన్లో జరిగే దొంగతనాల్లోనూ, రైళ్ళలో అప్పుడప్పుడూ జరిగే దొంగతనాల్లోనూ నారాయణ బృందానికి ప్రమేయం వుంటుందని అందరికీ తెలుసు. అయితేనేం! ఎవ్వరూ బైటపెట్టరు. పోలీసువాళ్ళు కలిగించుకోరు. వాళ్ళని యెలా మౌనంగా వుంచాలో నారాయణకి తెలుసు మరి? వీటన్నింటి వెనుక బ్రెయిన్ చంటిదే. అందుకే చంటిమాట అలక్ష్యం చెయ్యడు నారాయణ.

కుంటి వెంకణ్ణి వదిలేసి, కాళ్ళతో ఒక్క తాపుతన్నాడు.

**మెల్లగా లేచి, ఆమె దగ్గరికి నడిచాడు, సిగరెట్ నుతారంగా కాల్చుకుంటూనే. ఆమె బెరుకు చూపులు చూస్తోంది. ఆమె చేతిలో ఓ చిన్న సంచి తప్పించి, మరేం లేదు. మాసిన చీర, సంస్కారం లేని జుత్తు ...!**

"దొంగనాయాల. మళ్లీ యెప్పుడన్నా అలా అన్నావా చూడు యేంసేస్తానో నీ ప్రాణం తీస్తాను..." క్రోధంతో అన్నాడు నారాయణ.

కుంటి వెంకడు యేడుస్తూనే వున్నాడు. వాడి ముక్కులోంచి రక్తం స్రవిస్తోంది. అది తుడుచుకుంటూ, "ఒరేయ్ నారిగా? బగవంతుడున్నాడ్రా, కుంటోణ్ణని నన్ను యిలా పచ్చడి సేసినావుగదరా, నువ్వు మాతరం సుకపడిపోయి.. సివరికి కుక్కసావు సస్తావు... యిది నా సాపంరా..." రుద్ధస్వరంతో అన్నాడు వెంకడు.

"ఏట్రా పేల్తున్నావు కుంటి యెదవా:" అంటూ మళ్ళీ మీదికి రాబోయాడు నారాయణ.

చంటి మధ్యకొచ్చి నారాయణని వెనక్కి తీసుకు పోయాడు.

ఆ రాత్రి గుండెలో నెప్పివచ్చి వెంకడు మరణించాడు. తెల్లవారి లేచి చూస్తే వాడి శవం కనిపించింది.

అప్పుడూ పశ్చాత్తాప పడలేదు నారాయణ. మిగిలిన వాళ్ళెవరూ నారాయణని పళ్ళెత్తు మాట అనలేదు.

ఆ సంఘటన తర్వాత నారాయణంటే మరింత భయం అధికమయ్యింది అక్కడికి వారికి.

అటువంటి రోజుల్లో ఓ రోజు హౌరా మెయిల్ అనుకోకుండా ఆగిపోయిందా స్టేషన్లో. ఓ టిక్కెట్ ఎగ్జామినర్ యౌవ్వనంలో వున్న ఓ అమ్మాయిని బూతులు తిడుతూ, కంపార్టుమెంటు లోంచి దింపేశాడు టిక్కెట్టు లేదని. అంతలో బండికదిలిపోయింది. వెళ్ళి పోతున్న రైలుకేసి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయిందామె. బండి వెళ్ళి పోయాక, ఆమె చీర చెంగుతో కళ్ళొత్తుకోవడం, సిమ్మెంటు బెంచీ మీద కూచున్న నారాయణ చూశాడు. ఎంతయినా అతడూ మనిషే అతడికీ యేకోశానో మానవత్వం లేకపోలేదు. అందునా యిబ్బందిన పడిన శాల్తీ యౌవనంలో వున్న ఓ అమ్మాయి. ఏ మగాడికయినా జాలిపుట్టేస్తుంది.

మెల్లగా లేచి ఆమె దగ్గరికి నడిచాడు సిగరెట్ నుతారంగా కాల్చుకుంటూనే. ఆమె బెరుకు చూపులు చూస్తోంది. ఆమె చేతిలో ఓ చిన్న సంచి తప్పించి మరేంలేదు. మాసిన చీర, సంస్కారం లేని జుత్తు. చామనఛాయలో వున్నా, మట్టితో నిండిన వొళ్లు... యిదంతా చూశాక, ఆమె ఏ స్థాయికి చెందినదో గ్రహించేశాడు నారాయణ క్షణంలో. అయినా సరే ఆమె యౌవనం ఒంపులు ప్రదర్శిస్తూ కళ్ల చెదరగొట్టింది. తొలిచూపులోనే నారాయణని ఆకర్షించేసిందామె.

"ఎక్కడికెళ్ళాల!" హుందాగానే ప్రశ్నించాడు నారాయణ

వులిక్కిపడినట్టయ్యిందామె. లోతుకు పోయిన్న ఆ కళ్ళల్లో బెదురు స్పష్టంగా కనిపించింది నారాయణకి. "భయపడమాక, సెప్పు" యీసారి మామూలు ధోరణిలో సౌమ్యంగానే అడిగాడు.

"యిజయనగరం..." బిత్తుగ్గానే చెప్పింది.

"అక్కడెవరైనా మీ వోళ్ళున్నారా!"

లేరన్నట్లు తలూపింది.

"మరెందుకయితే!"

"అడుక్కోడానికే వుర్రైతేనేటి!"

నారాయణకి, ఆమె పరిస్థితి ఆమె యేకోవకి చెందిన వ్యక్తో పూర్తిగా అర్థమై పోయింది.

"ఇక్కడెందుకు దిగిపోనావు!"

"నాను దిగలే. టి.టి.బాబు దింపేసినాడు. ఎంత బతిమలాడినా వప్పుకోనేదు."

"ఇక్కడుండి పోతావా! ముష్టెత్తుకోడానికేవూరైతేనేటి? ఏటంటా!" ఆమె కేసి పరిశీలనగా చూస్తూ అన్నాడు. ఆమె యేం సమాధానం చెబుతుందోనన్న ఆతృత, ఆసక్తి, అతడ్ని కంగారు పెట్టినయ్.

ఆమె చప్పున జవాబు చెప్పలేదు. కాని నారాయణ కేసి నిస్సహాయంగా చూసింది. "సెప్పు మరి! నన్ను నావాలకం సూసి నానేదో వుద్యోగం సేస్తున్నానని అనుకోమాక. నాకు స్టేషనే ఇల్లు. నీలాంటోల్లందరూ నా వోళ్ళే. అదిగో అటు సూడు దూరంగా ఆ రైలు కమ్ముల పక్కన గుడిసెలగుపిస్తన్నయ్ కదా.. అవి మావే. అవసరమొస్తే, అక్కడకెల్లి పోతుంటాం." అంటూ దూరంలో వున్న గుడిసెల్ని చూపించాడు.

ఆమె అటుకేసి చూసింది. స్టేషనుకి దగ్గర్లోనే వున్నాయ్. ఆమె ఆవలించింది. నారాయణ ఆమెసకీ నచ్చాడు. అతడి వాలకం చూస్తుంటే చొరవున్న మనిషిలానే తోచిందామెకి. ఎక్కడికెళ్ళినా తనకాశ్రయం యేముంది! ఆసరా యేముందని!... ఓ నిర్ణయానికి కొచ్చేసింది.

"వుండిపోతా!..."అంది అతడి కళ్ళలోకే చూస్తూ

నారాయణ మహదానంద పడ్డాడు."నీ పేరేమిటి!"

"కనకం."

"నీకు తగిన పేరే. పెట్టార్లే మీ అమ్మానాన్నా.." చిన్నగా మందహాసం చేస్తూ, అన్నాడు నారాయణ.

"ఆల్లెప్పుడో సచ్చినారు..."

"పోన్లే నాకూ యెవురూ నేరులే.. ఎల్లి ఆ పంపు దగ్గర మొహం కడుక్కునిరా.. టీ తాగుదువుగాని."

కనకం పంపువేపు నడిచింది. ఆమె మెదడు నిండా ఆలోచనలే. గతించిన రోజులు గుర్తుకొచ్చి మనసుని బాధపెట్టినా వాటిని మర్చిపోయి యిక్కడ సుఖంగా బ్రతగ్గలనన్న నమ్మకం, విశ్వాసం, ఆమెలో యేర్పడ్డాయి. నారాయణ మంచితనానికి మురిసిపోయింది. అటువంటి వాళ్ళెంత మందుంటారు! అనుకుంది. పంపుదగ్గర మొహం కడుక్కుని చీర చెంగుతో తుడుచుకుంది.

నారాయణ ఆమెకేసే చూస్తున్నాడు.

ఆమె దగ్గరికొచ్చాక మళ్ళీ పరిశీలనగా చూశాడు. ఆమె మొహంలో తేట కనిపించింది. అందంగానే వుంటుందే అనుకున్నాడు మనసులో.

"పద టీ తాగుదాం.." అంటూ టీ దుకాణం కేసి నడిచాడు నారాయణ. రెండు టీలు తీసుకుని ఒకటామెకిచ్చి, మరొటి తను తీసుకున్నాడు.

"ఏవిట్రోయ్ నారాయణా మా హుషారుగా వున్నావీ వేళ! కొత్త పిట్టలా వుందే..!" టీ దుకాణం యజమాని చంద్రంబాబు చిరునవ్వుతో ప్రశ్నించాడు.

నారాయణ కోపం తెచ్చుకోలేదు పైగా ఓ మందహాసం చేశాడు.

"మీ కెందుకండీ అయన్నడు. మీ వయస్సు గుర్తుంచుకున్నారా!.." చిన్న చురక తగిలించాడు.

అంతే చంద్రంబాబు మరి మాట్లాడలేదు.

అలా పరిచయమైన కనకం, నారాయణ జీవితంలో భాగస్వామిగా మారిపోయింది

* * *




కనకం జీవిత విధానమే మారింది. ఆమెను ముష్టికి పంపడానికి మనస్కరించడం లేదు. నారాయణ గుడిసెలోనే కాపురం పెట్టాడు.

కనకం తన అదృష్టానికి సంబరపడిపోయింది. ఇటువంటి అవకాశం తన జీవితంలో వస్తుందని ఆమె యేనాడూ వూహించలేదు. అంతా కాకతాళీయంగా జరిగిపోయింది. వాళ్ళిద్దరి జీవితం మూడు పువ్వులూ ఆరుకాయలుగా పరిడవిల్లుతోంది.

* * *

ఎవరి జీవితంలో యెటువంటి పరిణామం వస్తుందో, యెవరూ వూహించలేరు. అది మానవ సహజం.

ప్రక్క స్టేషన్‌కి యెప్పుడన్నా వెళ్తే తిరిగి వచ్చినపుడు

నడుస్తున్న రైల్లోంచి నేర్పుగా దిగడం నారాయణకి అలవాటే. ఆరోజు కూడా నడుస్తోన్న రైల్లోంచి నిబ్బరంగా దిగేద్దాం అనుకున్న నారాయణ దిగాడు గాని కాలుజారి ప్లాట్‌పారవ్‌కీ, రైలుకీ మధ్యగల స్థలంలో పడిపోయాడు. ఫలితంగా ఒంటి నిండా దెబ్బలు తగిలి ఓ కాలు తెగిపోయింది. అతడి జీవితంలో యిదో మలుపయ్యింది. ఆర్నెల్లు గవర్నమెంటు హాస్పిటల్లో వుండి కర్రికాలుతో తిరిగి వచ్చాడు.

కనకం కన్న కలలన్నీ కరిగిపోయాయి. ఆమె ఆశలన్నీ మట్టిగలిశాయి.

తను హాస్పిటల్లో వున్న ఆర్నెల్లూ, చంటి తననీ, కనకంనీ పోషిస్తూ వచ్చాడు. తనకి కాలుపోవడం మిగిలిన కుర్రాళ్ళకీ, ముష్టివాళ్ళకీ ఆనందంగా వుందేమో తెలీదుగాని, యిప్పుడు తనని చూసి వాళ్ళు మునుపటిలా భయపడ్డంలేదు... అవన్నీ తల్చుకుంటుంటే నారాయణకి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యింది. 'బగమంతుడెంత అన్నేయం జేసినాడు! నన్నే నమ్ముకుని, నా ఆసరా మీదే యీ వూళ్ళోనే వుండిపోయింది కనకం. దాని అచ్చటా ముచ్చటా యింకెట్టా తీరుతాయి. దాన్ని యింకేం సుఖపెట్టగల్డు తను! ఈల్లంతా ఇంక తన మాటింటారా! తను ఎంకడిలా అవిటోడయ్యాడు. వాళ్ళిక యెదురు తిరగరూ! చంటి మాతరం తనంటే అభిమానంగానే సూస్తన్నాడు. ఆడే నేకపోతే, తనేమైపోను..! యిలా తనలో తనే ఆలోచిస్తుంటే ఆనాడు వెంకడన్న మాటలు, నారాయణ చెవుల్లో గింగురు పెట్టినయ్. 'ఆడిచ్చిన శాపమే తననీ విధంగా సేసిందేమో' అన్న అనుమానం రాకపోలేదు నారాయణకి. క్రమంగా జీవితం మీద విరక్తి పుడుతోంది వాడికి.

మెల్లగా లేచాడు. గుడిసెకేసి దారి తీశాడు. కాస్సేపు కనకంతో కబుర్లు చెప్పుక్కూచోవాలనిపించింది నారాయణకి.

గుడిసె దగ్గరికి వెళ్ళే సరికి నవ్వులు వినిపించినాయి నారాయణకి. ఆ మగనవ్వు చంటిదే. కనకం చంటి నవ్వుకుంటూ పరిహాసాలాడుకుంటున్నారు.

గుమ్మం దగ్గరే వాళ్ళకి కనిపించకుండా నిల్చుని, అంతా వినాలనుకున్నాడు నారాయణ.

"దేముడు మా నారాయణన్నకి అన్నేయం సేసినాడు కనకం. నేకుంటే ఆడీ స్టేషన్లో మారాజే కదా? ఇప్పుడాడి మాటకి యెవుడూ నెక్కసెయ్యటంల్లే: నా బయం మీద ఆళ్ళంతా అలా అణిగి వున్నారుగాని, నేకుంటే ఆడ్ని ఆడిపోసుకుందురు. పాపం, నీగురించే ఆడు బెంగ పెట్టుకుంటన్నాడు."

"ఏం సేత్తాంలే సంటీ, ఎవురు సేసుకున్నది ఆల్లు అనుబగించవల్సిందే గదా? నారాయణ శానా మంచోడు. అది నాకూ తెలుసును. కాని, యిప్పుడెందుకూ పనికిరాడు. రోజులు గడవాలంటే ఆదాయం వుండాలా మరి. ఎట్టా సంపాదిస్తాడంటా! ఎన్నాళ్ళని నీ మీద ఆధారపడతాం సెప్పు. ముష్టెత్తడానికి నామూషికా కాదా!" అంది కనకం.

"కాదా మరి ఇంకేదేనా వూరెల్లి ముష్టెత్తొచ్చుగాని యీ వూళ్ళో మారాజునా బతికినోడు ఆ పన్జెయ్యనేడు కదా? ఆ యిసయంలో ఆడి మనసు నొప్పించకు. నానున్నానుకదా... మీ యిద్దరికీ తిండి పెడతాలే,,," హామీ యిచ్చాడు చంటి.

"నువ్వెంతా మంచోడివి సంటీ" చంటివొళ్ళో వాలిపోయింది కనకం.

"నువ్వెం అందంగా వుంటావ్ నీకు తెలుసా కనకం! అబ్బ వరిణించలేమనుకో:" ఆమె బుగ్గల్ని గిల్లుతూ అన్నాడు చంటి.

"నారాయణ కూడా అదే అంటుంటాడు" సిగ్గుపడిపోయింది కనకం.

ఆ దృశ్యాన్ని బైట్నుంచి మరి చూళ్ళేకపోయాడు నారాయణ. ఓ పక్క వల్ల మాలిన కోపం వస్తున్నా తన అసహాయతనీ, అశక్తినీ గుర్తుకు తెచ్చుకుని చంకలోని వూత కర్రికేసి నిస్సహాయంగా చూసి తనలోని కోపాగ్ని బలవంతంగా అణిచేసుకున్నాడు. పెదాలు గట్టిగ బిగబట్టాడు. నిరర్థకమైన తన బ్రతుక్కి అర్థం లేదనుకున్నాడు. తను బ్రతికుండి యెవర్ని వుద్ధరించాలో బోధపడలేదు. ఇంకా యిలానే బ్రతికి వుంటే అందరి యీసడింపులు యెత్తిపొడుపులు, యెదిరింపులు చవిచూడాలి. తాను తప్పుకుంటే కనీసం కనకం అయినా చంటితో సుఖంగా బ్రతుకుతుంది. తనంటే చంటికి యెంత అభిమానం



**కాపీ**

"కాపీకి రీసెర్చికి తేడా ఏమిటి?" అడిగాడు గంగారాం.

"ఒక విషయాన్ని ఒకే పుస్తకంలోంచి చూసిరాస్తే అది కాపీ, అదే కొన్ని పుస్తకాల్లోంచి చూసిరాస్తే అది రీసెర్చి" చెప్పాడు సీతారాం.

—శ్రీశారద (అమలాపురం)

వుందికం? ఎంత గౌరవం? అటువంటి వాడు సుఖంగా వుండాలని కోరుకోవడమే తనకిప్పుడు కర్తవ్యం. తనని నమ్ముకున్న కనకం తన దగ్గరింకేం సుఖపడుతుంది! దానికి తన నీడన అన్నీ కష్టాలే! ఛీ: ఛీ! యీయెదవ బతుకు వద్దు మరి: ఏనాడైతే బండి కింద పడ్డానో అప్పుడే సచ్చినా బాగుండేది...' అని అనుకుంటున్నంతలో దూరంలో రైలు కూత వినిపించింది నారాయణకి. ఓ గట్టి నిర్ణయానికొచ్చి అక్కణ్ణుంచి కదిలాడు మెల్లగా మనసులో గుడిసెలో వున్న యిద్దర్నీ దీవిస్తూ.

రైలు పట్టాల కేసి నడుస్తున్నాడు నారాయణ.

రైలు కూతవిని, స్టేషనుకి నెళ్ళాలన్న ఆత్రుతలో బైటికొచ్చాడు చంటి. అతడి దృష్టి రైలు పట్టాలకు దగ్గరవుతున్న నారాయణ మీద పడింది.

"కనకం: కొంప మునిగింది.." అన్నాడు గట్టిగా.

"ఏమయ్యింది సంటీ:" ఆత్రంగా బైటికొచ్చి అంది కనకం.

"నారాయణ వచ్చి మనిద్దర్నీ గుడిసెలో సూసినాడు గామోసు, ఆడి మనసిరిగి పోయుంటాది. అందుకే పాణం తీసుకోడానికి పట్టాలకేసి పోతన్నాడు. నాను తీసుకొస్తానుండు." అంటూ పరుగున వెళ్ళాడు కేకలేసుకుంటూ.

"నారాయణన్నా ఆగు... అంత పనీ సెయ్యకు నామాటినను."

నారాయణ పట్టాల మీద నుంచున్నాడు. కాస్తదూరంలో రైలుంది.

"సంటీ! మీ యిద్దరూ సుకంగా బతకండి." అంటూ ఇంజను ముందు పడిపోయాడు. అంతే!

"నారాయణా!" చంటి రుద్ధ స్వరం, పరిసరాల్లో మార్మోగింది.

కనకం కళ్ళు మూసుకుంటూ, బావురు మంటూ కుప్పలా కూలిపోయింది గుడిసె ముందు.

రైలాగింది.

రైల్వే సిబ్బంది వచ్చారు. చంటి ఆ దృశ్యాన్ని చూళ్ళేకపోయాడు. తర్వాత విధులకు ఆతడే పూనుకున్నాడు. ఆ రోజు కుంటి వెంకడన్న మాటలు చంటికి గుర్తుకొచ్చినయ్. ఔను. ఇది ఆడి శాపమే!... అనుకున్నాడు మనసులో.

*

